ఓవరాల్ వేసుకుంటూ డిసెక్షన్‌హాల్ లోపలికివస్తూ ద్వారంలోవున్న ప్రొఫెసర్‌ను విష్‌చేస్తూ ముఖంలోకి పరీక్షగా చూశాను. ఆయన కళ్ళు యెర్రగా వాచి వున్నాయి.



# 'మైసన్'

వి. జయదేవ్

మెల్లగా డిసెక్షన్‌హాల్ లోపలికివెళ్ళి, స్ట్రెచర్ దగ్గర మా బాచ్ మేట్‌ను చూసి "హలో" అన్నాను. మెల్లగా స్టూల్ దగ్గరికి లాక్కొని, "ఏ డిసెక్షన్ చేయాలి?" అని అడిగాను జేబులోనుంచిస్కాల్‌పెల్. ఫోర్‌సెప్స్ బయటికితీస్తూ "కెరోటిడ్ ట్రయాంగిల్" అన్నాడు వాడు. "అయితే చదవడం మొదలెట్టు. అన్నట్లు మూడో వాడేడీ?" అన్నాను చుట్టూ కలియ జూస్తూ" "ఎక్కడో ఏడుస్తుంటాడు. నువ్వు మొదలెట్టు" అంటూన్న వాడి మాట పూర్తి కాకుండానే, నడచు మూడోవాడు వగరుస్తూ వచ్చి. "ఇందాక భలే గమ్మత్తు జరిగిందిరా!" అని ఏదో చెప్పబోయి. యిద్దరం "ఇష్" అని గద్దించేసరికి విధిలేక నోరు మూశాడు.

స్కాల్‌పెల్‌తో ఇన్‌సిషన్స్ యిచ్చి. స్కిన్ రిఫ్లెక్ట్ చేసి. స్ట్రక్చర్స్‌ని క్లీన్ చేస్తున్నాను. ఇంతలో "ఇదిగో గురూ!" అంటూ ఓ స్టూడెంట్ వచ్చి సర్క్యులర్ ఇచ్చి వెళ్ళాడు. ఎంబ్రియాలజీ క్లాసు కోసం ఇచ్చిన పిలుపది. మెల్లగా దాన్ని పక్కవాడి కందించి డిసెక్షన్ ప్రారంభించాను.

టైము పదిన్నర అయింది. అటెండెన్సు యిచ్చి. ఇన్‌స్ట్రుమెంట్స్ కడిగి. ఓవరాల్ తీసేస్తూ కారిడార్‌లోకి వెళ్ళాను. లాకర్‌లో ఓవరాల్ పెట్టి. నోట్‌బుక్ తీసుకుని క్లాసురూంవైపు నడిచాను. అప్పటికే ప్రొఫెసర్ క్లాసులో వున్నారు. నేను నా సీట్‌లో కూర్చున్నాను.

ఆయన మెల్లిగా "ఇవాళ ఒక ఎబ్‌నార్మల్ డెవలప్‌మెంట్‌కి సంబంధించిన

## మినీ కథావీథి

స్పెసిమన్‌ని చూద్దాం" అని ఓ గాజు జాడీ బయటికి తీశారు.

పెద్ద తల, పూచిక పుల్లల్లాంటి కాళ్ళు. చేతులు వున్న ఆ స్పెసిమన్‌ని చూడగానే "హైడ్రోకెఫాలీ" అని ఊహించాను. ఆయన దాన్ని గురించి వివరించడం మొదలుపెట్టారు.

క్లాస్ అయిపోయిన తర్వాత అందరూ బయటకి నడుస్తున్నారు. నేను [illegible]డా వెళ్ళి అంతలోనే దాన్ని గురించి అనుమానం రావడంవల్ల వెనక్కివెళ్ళి, లోపలిదృశ్యం చూసి నిశ్చేష్టుడనయ్యాను. ప్రొఫెసర్‌గారి కళ్ళనుండి నీళ్ళుకారుతున్నాయి. మెల్లగా దగ్గరికి వెళ్ళి, "సర్" అని పిలిచాను. "ఎస్" అని "నువ్వా? ఏమిటి?" అన్నారు.. నా సందేహ నివృత్తి అయ్యాక, "సర్" అన్నాను. అనుమానంగా ఆస్పెసిమన్‌కేసి. ప్రొఫెసర్‌గారి బాధతో కూడిన ముఖంకేసి మార్చి, మార్చి చూస్తూ, "ఎస్ నీ అనుమానం కరెక్టే. వాడు నా కొడుకు లేకలేక పుట్టాడు. ఆ పుట్టిన వాడు కూడా ఇలాగే పుట్టాడు. ఎంతప్రయత్నించినా బతకలేదు. నువ్వు గమనించావోలేదో? శరీరంలో ఉండవలసిన అవయవాలు శరీరం బయట వున్నాయి. ఈ రెండూ కలిసిరావడం విచిత్రం. ప్రొఫెసర్‌గా నేను స్పెసిమన్‌ను సేకరించాలి. ఇక్కడకూడా అలాగే చేశాను. కానీ నాలోని తండ్రి ఇంకా చావలేదు." అంటూ బాధగా కళ్ళు మూసుకున్నారు.

నాకాయన ఆ సమయంలో హిమాలయాలంతగా ఎదిగిపోయినట్లనిపించారు.

★

గాథావళి:

## కట్టెకాలు నొప్పి

అలెగ్జాండర్ దసేవస్కీ వాయు విమానాల నమూనాలను సృష్టించాడు. అతని ఒక కాలు రెండవ ప్రపంచ యుద్ధంలో పనికిరానిదిగా మారింది. ఒకసారి దసేవస్కీ హాస్పిటల్‌ను చూడ్డానికి వెళ్ళాడు. ఒక హాస్పిటల్లో రోగుల



మనసును సంతోషపెట్టడానికి ఇలా అన్నాడు. "నాకొక కాలు పోయింది: దానికి బదులుగా కట్టెకాలును పెట్టుకున్నాను. అది వున్నందువల్ల లాభం వుంది. దానికి దెబ్బ తగిలితే నొప్పి అనిపించదు. కావలిస్తే ఇదో ఈ బెత్తాన్ని తీసుకుని కొట్టు" అని ఒక రోగికి బెత్తాన్ని ఇచ్చాడు. ఆ రోగి తన బలం కొద్దీ అలెగ్జాండర్ కాలుపై కొట్టాడు. అలెగ్జాండర్ నవ్వుతూ "చూశావా! నాకేమీ నొప్పిగా లేదు" అని అన్నాడు. రోగులు అందరూ నవ్వారు. ఆస్పత్రి అధికారులతో కలసి బయటకు వచ్చిన తరువాత అలెగ్జాండర్ దసేవస్కీ వంగి మంచి కాలును పట్టుకుంటూ నిల్చున్నాడు. అధికారి "ఏమైంది?" అని అడిగాడు.

"ఆ రోగి కట్టె కాలును కొట్టేది విడిచి మంచి కాలుపై కొట్టాడు" అన్నాడు అలెగ్జాండర్ దసేవస్కీ.

—చాగాపురం నాగేశ్వరరావు